సాక్షి అనంతపురం

శనివారం । 29 । మార్చి । 2025




చీనీ టన్ను రూ.22,120

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22,120 పలికాయి.



టమాట కిలో రూ.9

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.9 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

అబ్బురపరిచిన ఆర్మీ జవాన్ల విన్యాసాలు



కిందకు క్షేమంగా దిగిన తర్వాత నడుచుకుంటూ వెళుతున్న జవాన్లు

విడపనకల్లు: మండలంలోని డొనేకల్లు గ్రామ వ్యవసాయ పొలాల్లో శుక్రవారం భారత పదాతిదళం జవాన్లు నిర్వహించిన విన్యాసాలు అబ్బురపరిచాయి. జవాన్లు ప్యారాచూట్ ద్వారా శిక్షణ తీసుకునేందుకు అనువైన ప్రదేశం కావడంతో ఏటా డొనేకల్లు గ్రామ వ్యవసాయ పొలాల్లో ఈ ప్రక్రియను నిర్వహిస్తూ వస్తున్నారు. దాదాపు 250 మంది జవాన్లు 150 అడుగుల ఎత్తున విమానంలో ప్రయాణిస్తూ కిందకు దూకి ప్యారాచూట్ ద్వారా సాగించిన విన్యాసాలను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

ఈఓఆర్‌డీ కృష్ణకుమార్ సస్పెన్షన్

పామిడి: పామిడిలో ఈఓఆర్‌డీగా పనిచేస్తున్న డీ.ఆర్. కృష్ణకుమార్‌ను సస్పెన్షన్‌పై వేటుపడింది. ఈ మేరకు పీఆర్అండ్ఆర్‌డీ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణకుమార్ కర్నూలు జిల్లా పత్తికొండలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో కాంట్రాక్ట్ వర్కర్స్ జీతాలకు సంబంధించి రూ.1,33,27,673 డ్రా చేశారు. అందులో నిబంధనలకు విరుద్ధంగా రూ.74.63 లక్షలను ఒక కాంట్రాక్ట్ వర్కర్ ఖాతాలోకి మళ్లించి.. తిరిగి డ్రా చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించారు. అలాగే గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో అక్రమాలు చోటు చేసుకున్నందున ఆయనను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఈ-కేవైసీ గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు



అనంతపురం అర్బన్: రేషన్ కార్డులకు సంబంధించి ఈ-కేవైసీ నమోదు గడువును ప్రభుత్వం ఏప్రిల్ 30 వరకు పొడిగించినట్లు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ 2.20 లక్షల మంది ఈ-కేవైసీ చేయించుకోలేదని పేర్కొన్నారు. వీరి జాబితా పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ల వద్ద ఉంటుందని తెలిపారు. జాబితాలో పేరు ఉన్నవారు సంబంధిత రేషన్ షాపు లేదా వీఆర్‌ఓ లేదా సచివాలయ సిబ్బంది వద్దకు వెళ్లి ఈ-పాస్ యంత్రంలో కానీ వీఎస్‌డబ్ల్యూఎస్ మొబైల్ యాప్‌లో కానీ వేలిముద్ర వేసి ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు.



ప్రజారక్షణ మరచి..
పరిటాల సేవ

బరితెగించిన ఎస్‌ఐ సుధాకర్ యాదవ్

- రామగిరి ఎంపీపీ ఎన్నికల్లో వీరంగం
- అడ్వొకేట్ అని చూడకుండా నోటికొచ్చినట్టు దుర్భాషలు
- 'కేసులు పెట్టి లోపలేస్తా కొడకల్లారా' అంటూ ఊగిపోయిన వైనం
- పరిటాల కుటుంబం ఏది చెప్తే అదే చట్టమనే రీతిలో చెలరేగుతున్న ఎస్‌ఐ

ప్రజలకు సేవ చేయాల్సిన కొందరు పోలీసులు రాజకీయ నాయకుల సేవలో తరిస్తున్నారు. వారు చెప్పినదల్లా చేస్తున్నారు. వీరి తీరును చూసి ప్రజలు చీత్కరించుకుంటున్నారు. నాయకుల ఇంట్లో ఊడిగం చేస్తున్నట్టు వ్యవహరిస్తున్న పోలీసుల తీరు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వం నుంచి జీతం తీసుకుంటూ తాను పరిటాల కుటుంబానికి మాత్రమే సేవకుడినంటూ వ్యవహరిస్తున్నారు రామగిరి ఎస్‌ఐ సుధాకర్ యాదవ్. పరిటాల కుటుంబం ఏది చెబితే అదే నాకు 'లా' అన్నట్లు నడుచుకుంటున్నారు. తాజాగా రామగిరి ఎంపీపీ ఎన్నికల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఎంపీడీఓకు నోటీసులు ఇవ్వడానికి వెళితే.. ఎస్‌ఐ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అడ్వొకేట్ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులును 'నా కొడకల్లారా.. కేసులు పెట్టి మిమ్మల్ని లోపలేస్తా.. ఐరగ్గొడతా..మిమ్మల్ని తన్నితే దిక్కెవరు' అంటూ విరుచుకుపడ్డారు. ఎస్‌ఐ నుంచి తమకు ప్రాణహాని ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు వాపోతున్నారు. ఎస్‌ఐ అండతోనే పేరూరు ఎంపీటీసీ సభ్యురాలు భారతిని పరిటాల మనుషులు తమ వాహనాల్లోకి ఎక్కించుకున్నారు.

పరిధి దాటి పెత్తనం

ఎంపీపీ ఎన్నిక కోసం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఆరుగురు గురువారం బెంగళూరు నుంచి రామగిరికి వెళుతుండగా.. బాగేపల్లి టోల్ ప్లాజా వద్దకు పోలీసులు చేరుకుని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు బందోబస్తు మధ్య రామగిరి తీసుకెళ్తామని చెప్పారు. అక్కడి నుంచి ఏడు వాహనాల్లో వైఎస్సార్ సీపీ సభ్యులతో రామగిరికి బయలుదేరారు. అయితే కాన్వాయ్ చెన్నేకొత్తపల్లి దాటే సమయానికి మధ్యాహ్నం 12 గంటలైంది. ఆ సమయానికి రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి ముగ్గురు సభ్యులు మాత్రమే చేరుకోవడంతో నామినేషన్ దాఖలుకు గడువు మీరడంతో ఎన్నికను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ ప్రకటించారు. ఎన్నిక వాయిదా పడినట్లు తెలియడంతో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను పెనుకొండ తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడానికి పోలీసులు తీసుకెళ్లారు. కానీ సుధాకర్ రామగిరికి ఎస్‌ఐ అయినా పెనుకొండ వరకు వెళ్లారు. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలా రెచ్చిపోయారు. ఇతను పోలీసా.. రౌడీషీటరా అన్నట్టు వ్యవహరించారని ఘటనా స్థలంలో ఉన్న వారు చెబుతున్నారు.



రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత (ఫైల్)

ఖాకీ చొక్కాను అడ్డం పెట్టుకుని..

సుధాకర్‌ది ఆదినుంచీ ఇదే తీరు. ఇటీవల చిలమత్తూరులో తన భార్య పేరిట మూడెకరాల భూమి కొన్నారు. ఇక్కడ కోళ్లఫారం నిర్మిస్తున్నారు. ఈ భూమి చదును కోసం లేపాక్షి హబ్ భూముల నుంచి అక్రమంగా మట్టి తోలారు. గతంలో ఇలా మట్టి తోలినందుకు ఓ రియల్టర్‌కు మైనింగ్ శాఖ రూ.2 కోట్లు జరిమానా వేసింది. కానీ ఎస్‌ఐ సుధాకర్ మట్టి దందాను మాత్రం ఆ శాఖ పట్టించుకోలేదు. గతంలో సుధాకర్..టీడీపీ నుంచి టికెట్ ఆశించి భంగపడ్డారు. అంతేకాదు గతంలో ఓ డీఎస్పీ మీద కరపత్రాలు వేసి వివాదాస్పదమయ్యారు. గుత్తిలో పనిచేసినప్పుడు సీఐతో గొడవకు దిగారు. ఇలా ఒకటేమిటి ఆయన ఎక్కడికెళ్లినా పసుపు కండువా కప్పుకున్న ఖాకీలాగే ప్రవర్తిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఎండలు మండిపోతున్నాయ్

- 42 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- జిల్లా అంతటా భగ్గుమంటున్న భానుడు



అనంతపురం అగ్రికల్చర్: ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. గురువారం వరకు 40 డిగ్రీలకు కాస్త అటు ఇటుగా సుర్రుమనిపించిన సూరీడు శుక్రవారం 42 డిగ్రీలకు చేరుకున్నాడు. దీంతో ఒక్కసారి జిల్లా అంతటా ఎండతాపం పెరిగింది. కళ్యాణదుర్గంలో ఈ సీజన్‌లోనే అత్యధికంగా 42.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గుంతకల్లులో 41.5, విడపనకల్లులో 41.4, బొమ్మనహాళ్, యల్లనూరులో 40.7, తాడిపత్రి, కూడేరులో 40.6, శింగనమలలో 40.4, గుమ్మఘట్టలో 40.1 డిగ్రీలు నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు 20 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. ఉదయం 9 గంటలకే సూర్యప్రతాపం మొదలవుతోంది. మధ్యాహ్నం ఎండలు మరింత దడ పుట్టిస్తున్నాయి. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రాకపోవడమే మేలని నిపుణులు చెబుతున్నారు. మంచినీళ్లు, కొబ్బరినీళ్లు, మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్, పండ్లరసాలు లాంటివి ఎక్కువ తీసుకోవాలి. టోపీ, గొడుగు, మాస్క్, చేతిరుమాలు లాంటివి వాడితే మేలంటున్నారు. వడదెబ్బబారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ప్రధానంగా రైతులు, కార్మికులు, పిల్లలు, వృద్ధులు, రోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యం

అనంతపురం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి అధికారులతో జిల్లాస్థాయి రోడ్డు భద్రత, నార్కో కో-ఆర్డినేషన్ (ఎస్‌సీఓఆర్‌డీ) కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించే దిశగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్డు భద్రతలో భాగంగా జరిమానాల వసూలు, హెల్మెట్ లేకుండా ప్రయాణం, అధిక వేగంతో వాహనాల నడుపుతున్న వారిని ఎంతమందికి గుర్తించారు అనే వివరాలను ప్రతినెలా అప్‌డేట్ చేయాలన్నారు. నగరంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీకోవాలని చెప్పారు. మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలు సేవించడం ద్వారా కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. 1972 టోల్‌ఫ్రీ నంబర్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లోని ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించాలన్నారు. అన్ని మునిసిపాలిటీల్లోని డిస్‌ప్లే బోర్డుల్లోనూ నంబర్ పోస్టర్ ప్రదర్శించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, ఆర్‌డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజగోపాల్, డీటీసీ వీర్రాజు, అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల వాతావరణం కల్పించాలి

జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటుకు అనుకూల వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగం అభివృద్ధి ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో ఏర్పాటు కానున్న ఆస్ట్రోబేస్ స్పేస్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి 21.52 ఎకరాల భూమి కేటాయించామన్నారు. పీఎంఈజీపీ కింద ఎంపికైన యూనిట్లకు రుణం మంజూరు చేయాలని ఆదేశించారు. స్టాండప్ ఇండియా పథకం కింద లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. ఈ ఏడాది కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసయాదవ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఫ్యాప్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎస్పీ జగదీష్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పింఛను పంపిణీ పకడ్బందీగా చేపట్టండి

ఏప్రిల్ 1న సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ శుక్రవారం తన క్యాంపు కార్యాలయం నుంచి పింఛను పంపిణీ అంశంపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, దిశానిర్దేశం చేశారు.

190 పనులు.. 2 రోజులే గడువు

మొద్దునిద్రలో ఉపాధి హామీ అధికారులు

- బిల్లులు చెల్లించకపోవడమే కారణం
- రూ.10.94 కోట్లు వెనక్కి వెళ్లే ప్రమాదం
- చేపట్టిన పనుల్లోనూ నాణ్యత లోపించిందనే విమర్శలు

రాయదుర్గం: గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేందుకు ఏటా కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కంపొనెంట్ కింద నిధులు మంజూరు చేస్తోంది. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు చేపడతారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 32 మండలాల్లో 1,902 పనులకు అనుమతులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో రూ.100.90 కోట్ల వ్యయంతో డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేలా కార్యాచరణ ప్రారంభించారు. ఇప్పటివరకూ రూ.86.63 కోట్ల వ్యయంతో 1,712 పనులు పూర్తి చేశారు.

నిధులు వెనక్కి వెళ్లాల్సిందేనా..?

జిల్లావ్యాప్తంగా ఇంకా 190 పనులు నేటికీ ప్రారంభించలేదు. ఈ పనులన్నీ ఈ నెలాఖరు లోపే పూర్తి చేయాల్సి ఉండటం గమనార్హం. పనులు చేపట్టకుంటే వాటి కోసం కేటాయించిన రూ.10.94 కోట్లు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. అయినా, గడువు గండం తరుముకొస్తున్నా మొద్దునిద్ర పోతుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా అక్టోబర్, నవంబర్ మాసాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి. అయితే ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం చివర్లో పనులు మొదలుపెట్టారు. తొలి రెండు వారాలు చకచకా బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత బిల్లులు జమ చేయడంలో మొండికేసినట్లు తెలిసింది. రూ.కోట్లలో బిల్లులు ఆగిపోవడంతో కొత్త పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో లక్ష్యం పూర్తిచేయడం కష్టంగా మారుతోంది.



ఉద్దేహాళ్‌లో వేసిన మట్టి రోడ్డు

నాణ్యత.. నగుబాటు!

సీసీ రోడ్ల పనులపై పర్యవేక్షణ కొరవడి నిర్మాణాల్లో నాణ్యత లోపించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్యూరింగ్ సక్రమంగా లేక నెర్రలు చీలాయని పలువురు చెబుతున్నారు. ఇంజినీరింగ్ సిబ్బంది కొరత దృష్ట్యా చాలాచోట్ల గ్రామ సచివాలయ సిబ్బందికే బాధ్యతలు అప్పగించారు. వారిపై కూటమి నాయకులు అజమాయిషీ చేయడంతో పనుల్లో నాణ్యత లోపించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధి పథకం కింద జరిగిన ప్రతి పనిని ఉన్నతాధికారులు పరిశీలించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్లు, డ్రైన్ల వివరాలు..

మొత్తం పనులు	1,902
కేటాయించిన నిధులు	రూ. 100.28 కోట్లు
పనుల పూర్తికి గడువు	మార్చి 31
ఇంకా మొదలు కాని పనులు	190

గడువులోపు పూర్తి చేస్తాం

జిల్లాలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల్లో వేగం పెంచాం. ఈ నెలాఖరులోగా లక్ష్యం చేరుకునేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకూ చేపట్టిన ప్రతి పనీ నాణ్యతగా ఉంది. ఈ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. అన్నీ చూశాకే సిబ్బంది బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. గత మూడు నెలల నుంచి కొన్ని పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది.


– అస్లాంబాష, పీఆర్ ఎస్ఈ, అనంతపురం

కసాపురంలో రేపటి నుంచి ఉగాది ఉత్సవాలు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో రేపటి నుంచి విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బెంగళూరు నుంచి తెప్పించిన ప్రత్యేక పుష్పాలతో, విద్యుత్ దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. ఆలయ ప్రాంగణం, గంగా నిలయం వద్ద చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఆలయ ముందు భాగంలోని రెండు పార్కులను సుందరీకరించారు. గుంతకల్లు మున్సిపాలిటీ నుంచి నిరంతరంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని రెండు ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. భక్తుల కాలక్షేపం కోసం రోజూ వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు.

ఉత్సవాలు ఇలా...

ఉత్సవాల షెడ్యూల్‌ను ఆలయ ఈఓ కె.వాణి శుక్రవారం వెల్లడించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 30న తొలిరోజు గ్రామోత్సవం ఉంటుంది. సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి పురవీధుల గుండా శమీ వృక్షం వరకూ ఊరేగించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ముఖ మంటపం ఎదుట ప్రత్యేక వేదికపై పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉంటుంది. రెండో రోజు ఈ నెల 31న స్వామి వారి రథోత్సవం ఉంటుంది. మూడో రోజు ఏప్రిల్ 1న లంకా దహనం కార్యక్రమం ఉంటుంది. ఆ రోజు సాయంత్రం 6గంటలకు విశేష అలంకరణలో ఒంటె వాహనంపై కొలువుదీరిన ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని ఆలయ సమీపంలోని కాశీవిశ్వేశ్వరాలయం వరకూ ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ఆంజనేయస్వామి వారి చేతుల మీదుగా లంకాదహనం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. పోలీస్ ఔట్ పోస్టు వద్ద ఉన్న ఖాళీ స్థలంలో దాదాపు రెండు గంటల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



విద్యుద్దీపాలంకరణలో వెలుగులీనుతున్న ఆలయం

గెలుపు కోసం అడ్డదారులు

- టీడీపీ నేతల ప్రలోభాలకు లొంగని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు
- దాడులు, బెదిరింపులకు స్వస్తి చెప్పి సూపర్ సిక్స్‌పై దృష్టి పెట్టండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ: స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలన్న కుట్ర, కుతంత్రాలతో అధికార టీడీపీ నేతలు అడ్డదారులు తొక్కేందుకు ప్రయత్నించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి విమర్శించారు. రామగిరి ఎంపీపీ ఎన్నికల నేపథ్యంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను అనంతపురం రెండో పట్టణ పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్టు చేశారు. జెడ్పీ క్యాంపస్‌లోని క్యాంప్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గిరిజమ్మను అనంత వెంకట్రామిరెడ్డి పరామర్శించారు. అనంతరం చైర్‌పర్సన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. బలం లేకపోయినా ఉప ఎన్నికల్లో గెలవాలన్న దుర్బుద్ధితో టీడీపీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు తెగబడ్డారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యాన్ని ఎలా ఖూనీ చేశారో రాష్ట్ర ప్రజలందరూ చూశారని పేర్కొన్నారు. సంఖ్యాబలం లేకపోయినా అక్రమ కేసులు పెడతామని బెదిరించడం, దాడులు చేయడం, కిడ్నాప్‌కు పాల్పడటం, ప్రలోభాలకు గురి చేయడం దురదృష్టకరమన్నారు. అయితే తమ పార్టీ ఎంపీటీసీ సభ్యులు ఏమాత్రం భయపడకుండా, ప్రలోభాలకు గురి కాకుండా నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడ్డారని, వారందరినీ అభినందిస్తున్నానని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి, గాండ్లపెంటలో అక్కడి ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని ఎన్నికలకు ముందు ఇచ్చిన అభివృద్ధి, సూపర్‌సిక్స్ పథకాల అమలుపై దృష్టి సారిస్తే మంచిదని హితవు పలికారు. అనంతపురం జిల్లాలో అధికార యంత్రాంగం గట్టిగా నిలబడటంతో ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని అభినందించారు. అయితే శ్రీసత్యసాయి జిల్లాలో మాత్రం ఎందుకు ఉదాసీనంగా వ్యవహరించారో అర్థం కావడం లేదన్నారు. పెనుకొండలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. పోలీసుల తీరు మారాల్సి ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంత వెంట పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రవీంద్రా రెడ్డి, నగర అధ్యక్షుడు సోమశేఖర్, ఇతర నాయకులు ఉన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను పరామర్శిస్తున్న అనంత వెంకట్రామిరెడ్డి, ఇతర నాయకులు

జెడ్పీ చైర్‌పర్సన్ హౌస్ అరెస్ట్

రామగిరి ఎంపీపీ ఎన్నిక సందర్భంగా మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను అనంతపురం రెండో పట్టణ పోలీసులు శుక్రవారం హౌస్ అరెస్ట్ చేశారు. ఎంపీపీ ఎన్నిక గురువారం జరగాల్సి ఉండగా శుక్రవారానికి వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే శుక్రవారం కూడా ఎన్నిక జరగలేదు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు జగదీశ్, వి.రత్న ఆదేశాల మేరకు ముఖ్య నేతలను హౌస్ అరెస్టు చేశారు. అందులో భాగంగా జెడ్పీలో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ క్యాంప్ కార్యాలయానికి ఉదయం 7గంటలకే అనంతపురం రెండో పట్టణ సీఐ శ్రీకాంత్, ఎస్‌ఐ రుష్యేంద్రబాబు, ఏఎస్‌ఐ గోవిందమ్మ, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, కానిస్టేబుళ్లు లింగమ్మ, విజయకుమార్ చేరుకున్నారు. అప్పటికే ఆమె రామగిరి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. హౌస్ అరెస్టు చేస్తున్నట్లు ఆమెకు సమాచారం అందించారు. సాయంత్రం 5 గంటల వరకు ఆమె గడపదాటి బయటకు రాలేకపోయారు.

క్లుప్తంగా

జేఎన్‌టీయూ స్నాతకోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న వీసీ హెచ్.సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) 14వ స్నాతకోత్సవం నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై వర్సిటీ అధికారులతో వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు శుక్రవారం సమీక్షించారు. వర్సిటీ ఛాన్సలర్, ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్‌ను స్నాతకోత్సవానికి ఆహ్వానించనున్న నేపథ్యంలో స్నాతకోత్సవ నిర్వహణకు సంబంధించి కమిటీల నియామకం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఎన్.దేవన్న, వర్సిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో ఉద్యోగావకాశాలు

అనంతపురం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీవీ ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జనరల్ నర్సింగ్ మిడ్వైఫరీ (జీఎన్ఎం), బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు జర్మన్ భాషపై శిక్షణ ఇచ్చి ఆ దేశంలో ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. పూర్తి వివరాలకు 95818 53106లో సంప్రదించవచ్చు.

2న కానిస్టేబుళ్ల బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం: పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు సంవత్సరాలు ఒకే చోట పనిచేసిన కానిస్టేబుళ్లకు ఏప్రిల్ 2న ఏఆర్ డీఎస్పీ ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. సీనియార్టీ జాబితాలో మొత్తం 91 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. ఈ మేరకు ఎస్పీ పి.జగదీష్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫ్యాక్షన్‌కు జీవం పోస్తున్న టీడీపీ

- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో ఫ్యాక్షన్‌కు జీవం పోసేలా టీడీపీ కుట్ర చేస్తోందని వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్ర రెడ్డి ఆరోపించారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల పట్ల ఈ ప్రభుత్వానికి గౌరవం లేదన్నారు. స్థానిక సంస్థ ఉప ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో ఎన్నికల కమిషనర్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఈ ఎన్నికల్లో టీడీపీ వ్యవహరించిందన్నారు. ఎంపీటీసీలకు రక్షణ కల్పించాలని హైకోర్టు నుంచి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఉత్తర్వులు తీసుకువచ్చినా.. జిల్లా పోలీసు యంత్రాంగం ఆ దిశగా చర్యలు చేపట్టలేకపోవడం సిగ్గుచేటన్నారు. న్యాయ, పోలీసు వ్యవస్థను భ్రష్టు పట్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు యోగానంద రెడ్డి, నాయకుడు ఎంఎస్ఎస్ సాదిక్ పాల్గొన్నారు.

ఎప్పుడనేది చెప్పలేం...

కూలేది ఖాయం!



శిథిలావస్థలో ఉన్న ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం పేక మేడలా మారింది. ఎప్పుడు కూలుతుందో చెప్పలేని పరిస్థితి. రోజూ ఎక్కడికక్కడ పైకప్పు శిథిలాలు కుప్పకూలుతుంటే ఉద్యోగులు అభద్రతాభావంతో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా... సంబంధిత అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. కనీసం తాత్కాలికంగానైనా కార్యాలయాన్ని మార్చే ఆలోచన కూడా చేయకపోవడం గమనార్హం. అయితే ఆర్ఎం కార్యాలయ దుస్థితిని పరిశీలించిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఆధునిక హంగులతో కూడిన నూతన భవనాన్ని నిర్మిస్తామంటూ నాడు ఆర్భాటంగా హామీనిచ్చారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపినట్లు పేర్కొన్నారు. అయితే ఆ ప్రతిపాదనలు ఏమయ్యాయో ఎవరికీ సమాధానం చిక్కని మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోయింది. పైకప్పు శిథిలాలు ఎప్పుడు నెత్తిన కూలుతాయో తెలియని భవనం కింద... ఆ పక్కనే బయలు ప్రదేశం నుంచి వెలువడుతున్న దుర్గంధాన్ని భరిస్తూ విధులు నిర్వర్తించడం దుర్భరంగా మారిందంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఉంటున్న అతిథి గృహానికి ఏమాత్రం లోటు రానివ్వకుండా అధికారులు చూసుకోవడం విమర్శలకు తావిస్తోంది. పూల నాగరాజు చాంబర్‌లో సుగంధభరితమైన సువాసనలు వెదజల్లే పర్‌ఫ్యూమ్‌లు, అతిథి గృహాన్ని శుభ్రంగా ఉంచేందుకు రోజూ ఇద్దరు పారిశుద్ధ్య కార్మికులు, ఇతర అవసరాలు తీర్చేందుకు సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. ఇందులో కనీసం పది శాతం శ్రద్ధ ఉద్యోగ, కార్మికుల సంక్షేమంపై, నూతన కార్యాలయ భవన నిర్మాణంపై సారించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను పలువురు కోరుతున్నారు.







ఇటీవల కుప్పకూలిన కార్యాలయ సన్‌షెడ్, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట బయలు ప్రదేశంలో నెలకొన్న అపరిశుభ్రత, కార్యాలయం ఎదుట దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీటిలో తచ్చాడుతున్న పందులు

విద్యుత్ ప్రమాదాలు నివారించాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



లఘుచిత్రాల సీడీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఇతర అధికారులు

అనంతపురం అర్బన్: విద్యుత్ ప్రమాదాలు నివారించే దిశగా లఘుచిత్రాల ద్వారా విస్తృతస్థాయి ప్రచారం చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలను వివరిస్తూ విద్యుత్‌శాఖ, ఆర్‌డీటీ సంయుక్తంగా రూపొందించిన లఘుచిత్రాల సీడీని శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ముఖ్యంగా రైతులు, కూలీలకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇందుకు లఘుచిత్రాలు, వివిధ ప్రసార మాధ్యమాలను వేదికగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, విజిలెన్స్ సీఐ విశ్వనాథ్‌చౌదరి, విద్యుత్ శాఖ అధికారులు రామకృష్ణ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, ఉద్యోగులకు అండగా ఉంటాం



వైఎస్సార్‌టీయూసీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న అనంత వెంకట్రామిరెడ్డి, విశ్వ, ఓబిరెడ్డి తదితరులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి
- ఘనంగా వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ వేడుకలు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో ఇబ్బంది పడుతున్న ఉద్యోగ, కార్మికులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భవ వేడుకను యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంత వెంకట్రామిరెడ్డి ముందుగా దివంగత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జెండాను ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ... వైఎస్సార్‌సీపీలోనే శ్రామిక అనే పేరు ఉందని, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీను స్థాపించారని గుర్తు చేశారు. 2014 నుంచి 2019 వరకు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. దేశచరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఆశా వర్కర్లకు రూ.3వేల నుంచి రూ.10వేలు గౌరవవేతనం పెంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. డ్వాక్రా సంఘాల యానిమేటర్లు, బుక్ కీపర్లకు రూ.10వేలు అందించామన్నారు. కాంట్రాక్ట్ క్రమబద్ధీకరణతో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. మునిసిపల్ కార్మికులకు ఒకేసారి రూ.18వేలు చెల్లించేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఫ్యాక్టరీల్లో శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర వైఎస్సార్‌సీపీదన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో సీఎం చంద్రబాబు ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. వలంటీర్లను తొలగించి రోడ్డు పాలు చేశారన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబుకు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. జిల్లాలోని కార్మిక, ఉద్యోగ సంఘాలతో చర్చించి ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే న్యాయం చేకూరే వరకూ పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, కేవీ రమణ, సీపీ వీరన్న, కృష్ణవేణి, పెన్నోబులేసు, చింతకుంట మధు, అమర్‌నాథ్ రెడ్డి, రహంతుల్లా, వెన్నం శివరామిరెడ్డి, మార్కెట్ ఖాజా, బలరాం, అనిల్‌కుమార్ గౌడ్, ఆసీఫ్, రామయ్య పాల్గొన్నారు.

'క్షుద్ర పూజలతో బలిగొన్నారు'

గుత్తి: క్షుద్ర పూజలు చేయడం వల్లనే తన కుమారుడు మరణించాడంటూ పోలీసులకు బాధిత తండ్రి ఫిర్యాదు చేశాడు. వివరాలు... గుత్తిలోని ఆచారి కాలనీలో నివాసముంటున్న వేణుగోపాలాచారి కుమారుడు వీరాచారి కోట వీధిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. గత ఫిబ్రవరి 22న పాఠశాల సమీపంలో ఉన్న బావిలోకి ఈతకు వెళ్లి రాజా మృతి చెందాడు. ఘటనకు సంబంధించి అనుమానాలు వ్యక్తం చేస్తూ శుక్రవారం గుత్తి పోలీసులకు వేణుగోపాలాచారి ఫిర్యాదు చేశాడు. తమ ఇంటి వద్దనే నివాసముంటున్న మాణిక్యం, ఆయన భార్య మహాలక్ష్మి, శివశంకరాచారితో తమకు వివాదం ఉందని, ఈ క్రమంలో వారు క్షుద్రపూజలు చేయడం వల్ల ఇంటిల్లిపాది అనారోగ్యంతో బాధపడుతున్నామని, తన కుమారుడి పేరును ఓ బొమ్మపై రాసి క్షుద్ర పూజలు చేసి బావిలో పడేయడంతో గత ఫిబ్రవరి 22న ఈతకని వెళ్లి అదే బావిలో కుమారుడు మృతి చెందాడంటూ పేర్కొన్నారు. తన కుటుంబం అనారోగ్యం పాలు కావడానికి, కుమారుడు మృతి చెందడానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రాణం బలిగొన్న ఈత సరదా



దాసరి భరత్

కణేకల్లు: ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన దాసరి పార్వతమ్మ, శ్రీనివాసులు దంపతులకు ఇద్దరు కుమారులు కాగా రెండో కుమారుడు భరత్ (19) పదో తరగతి వరకు చదువుకుని హమాలీగా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. ఇతనికి ఈత బాగా వస్తుంది. శుక్రవారం తన స్నేహితులు మధు, శివ, బ్రహ్మయ్యతో కలసి గోపులాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న రైతు అంజి పొలంలోని వాటర్ సంప్‌లో ఈత కొట్టేందుకు వెళ్లాడు. సరదాగా ఈత కొడుతుండగా ఉన్నఫళంగా భరత్ నీటమునిగాడు. ఎంత సేపటికీ బయటికి రాకపోవడంతో స్నేహితులు భయాందోళనకు గురై, విషయాన్ని వెంటనే ఫోన్ ద్వారా గ్రామస్తులకు తెలిపారు. దీంతో స్థానికులు అక్కడకు చేరుకుని దాదాపు 13 అడుగుల లోతున నీటిలో విగతజీవిగా పడి ఉన్న భరత్‌ను గుర్తించి వెలికి తీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఇదేం బాదుడు బాబూ?

- సామాన్యుల నడ్డివిరుస్తున్న కూటమి సర్కారు
- ఇంధన సర్దుబాటు పేరుతో భారీగా విద్యుత్ చార్జీల పెంపు
- ఎస్ఈ కార్యాలయ ముట్టడిలో సీపీఎం నాయకుల ధ్వజం



ఈఈ రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్: తమను గెలిపిస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతంగా చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్ ధ్వజమెత్తారు. మాటలకు.. చేతలకు పొంతన లేకుండా ఈ బాదుడేంటి బాబు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్పతో కలిసి విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఇంధన సర్దుబాటు ధరల పేరిట విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.వేల కోట్లు వసూళ్లు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ట్రూఅప్, సర్ చార్జీలతో ప్రజలపై భారంపడుతుంటే కొత్తగా ఇంధన సర్దుబాటు ధరలతో విద్యుత్ వినియోగదారులు అల్లాడిపోతున్నారన్నారు. గతంలో పోలిస్తే ఇప్పుడు ప్రతి నెలా రెండింతలు అధికంగా బిల్లులు వస్తున్నాయని మండిపడ్డారు. ఇంధన సర్దుబాటు ధరలను ప్రభుత్వమే విద్యుత్ డిస్కంలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయడానికి బడ్జెట్ లేదంటూ ప్రజలను చంద్రబాబు దారుణంగా మోసగించారన్నారు. స్మార్ట్ మీటర్ల రాకతో మీటర్ రీడర్లు వీధిన పడే పరిస్థితిని కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ప్రజా కంటక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని త్వరలోనే ప్రజలు బంగాళాఖాతంలో కలపడం ఖాయమన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ ఈఈ జేవీ రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేంద్ర, బాలరంగయ్య, వి.రామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సావిత్రి, పరమేష్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనంపై మార్గదర్శకాల విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో అసిస్టెంట్ ఎగ్జామినర్లు (ఏఈ) రోజుకు 40 పేపర్లు మాత్రమే దిద్దాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏప్రిల్ 3 నుంచి 9వ తేదీ వరకు ఏడు రోజుల పాటు మూల్యాంకనం జరుగుతుందని పేర్కొంది. ఈ మేరకు ప్రభుత్వం రూపొందించిన విధివిధానాలపై పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మార్గదర్శకాలు ఇలా...

- అసిస్టెంట్ ఎగ్జామినర్లు ఒక రోజులో 40 జవాబు పత్రాలను మాత్రమే మూల్యాంకనం చేయాలి.
- మూల్యాంకనం చేసిన అన్ని సమాధాన పత్రాల మార్కులను స్పెషల్ అసిస్టెంట్లు లెక్కించాలి.
- ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ మూల్యాంకనం చేసిన కనీసం 20 జవాబు స్క్రిప్ట్‌లను చీఫ్ ఎగ్జామినర్ ధ్రువీకరించాలి. అంటే మొత్తం 120 జవాబు స్క్రిప్ట్‌లు ధ్రువీకరించాల్సి ఉంటుంది.
- అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ నుంచి కనీసం రెండు స్క్రిప్ట్‌లను తనిఖీ చేయాలి.
- శిబిరం ప్రారంభమైన రోజు నుంచి పూర్తయ్యే వరకూ పోలీసు సిబ్బందితో గట్టి భద్రతను నిర్వహించాలి.
- స్పాట్ వాల్యుయేషన్ పూర్తయిన తర్వాత సీఈ, ఏఈ, స్పెషల్ అసిస్టెంట్ల జాబితాను వెంటనే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు పంపాలి.
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, విపరీతమైన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, స్పాట్ వాల్యుయేషన్ క్యాంపులో ఏఎన్ఎం, ప్రథమ చికిత్స కిట్, అవసరమైన మందులు, కూల్ డ్రింకింగ్ వాటర్ సదుపాయం, ఎయిర్ కూలర్లు ఏర్పాటు చేయాలి.
- మూల్యాంకనం సజావుగా జరిగేలా జిల్లాస్థాయి పరిశీలకులుగా నియమించినవారు స్పాట్ వాల్యుయేషన్ పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

3న ఎస్ఆర్ఐటీలో జాతీయ సాంకేతిక ఉత్సవం



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి, సిబ్బంది

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) కళాశాలలో ఏప్రిల్ 3వ తేదీన తరంగ్-2కె25 పేరుతో జాతీయ స్థాయి విద్యార్థి సాంకేతిక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన కళాశాలలో విడుదల చేసి, మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు తమ సాంకేతిక ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేదిక దోహదపడుతుందన్నారు. ఉత్సవంలో భాగంగా వివిధ సాంకేతిక పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, కోడ్ బజ్, ఐటీటీ, హ్యాకథాన్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ మేనియా, మోడల్ ఎక్స్‌పో, బ్రిడ్జి, బ్లిట్జ్, క్లూ క్రాఫ్ట్, మినిట్ మాస్ట్రో పిక్సెల్, పర్ఫెక్షన్ లాంటి ఆసక్తికరమైన ఈవెంట్లను నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు నగదు పురస్కారాలతో పాటు సర్టిఫికెట్లనూ అందజేస్తామన్నారు. సదస్సులో ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఈవెంట్ కన్వీనర్ డాక్టర్ చిత్ర లింగప్ప, ఐక్యూసీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: కంటి చూపు సక్రమంగా కనిపించకపోవడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ పరిధిలోని కొడిమి గ్రామానికి చెందిన నాగముని (59) రాచానపల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చిరుద్యోగిగా పని చేస్తున్నాడు. గతంలోనూ ఎడమకన్నుకు ఆపరేషన్ జరిగింది. అయినా చూపు సరిగా కనిపించలేదు. దీంతో ఇటీవల రెండో సారి సర్జరీ చేయించుకున్నాడు. అయినా ఫలితం దక్కలేదు. దీంతో ఇక తనకు చూపు శాశ్వతంగా కనిపించకుండా పోతుందనే ఆందోళనతో గురువారం రాత్రి భార్యాపిల్లలు మేడపై నిద్రిస్తుండగా ఇంట్లో అర్ధరాత్రి సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం భార్య ఇంట్లోకి వెళ్లి చూడగా భర్త విగతజీవిగా కనిపించడంతో బోరున విలపించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సాయికీర్తనం.. సాంస్కృతిక వైభవం



ధర్మో రక్షిత రక్షితః నాటికలోని ఓ ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి కొలువుదీరిన ప్రశాంతి నిలయంలో శుక్రవారం సాయికీర్తనలతో ఆంధ్రా సాంస్కృతిక వైభవం ఉట్టిపడింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన రెండు వేల మంది ఆంధ్రప్రదేశ్ యూత్ సభ్యులు ప్రశాంతి నిలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తకోటిని మురిపించారు. ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సామూహిక తాందూలార్చన నిర్వహించారు. ఎదురుగా సత్యసాయి పాదుకలను ఉంచి మంత్రాలను పఠిస్తూ పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు. సాయంత్రం సత్యసాయి బాలవికాస్ చిన్నారులు 'ధర్మో రక్షిత రక్షితః' పేరుతో చక్కటి సందేశాత్మక నాటికను ప్రదర్శించారు. రామాయణ ఘట్టంలో రాముని చరిత్ర, ధర్మాన్ని ఆచరించిన తీరును, భాగవతంలో కృష్ణుడు ధర్మ సంరక్షణకు పాటుపడిన తీరును చక్కగా వివరించారు.

సత్యసాయి సేవలో సాయికుమార్

నటుడు సాయికుమార్ శుక్రవారం సత్యసాయి సేవలో గడిపారు. ఉదయం ప్రశాంతి నిలయానికి విచ్చేసిన ఆయన.. నేరుగా వెళ్లి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజును కలిశారు.


ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం



హర్షవర్ధిని (ఫైల్)

రాప్తాడు రూరల్: మార్కుల ఒత్తిళ్లు ఓ ఇంటర్ విద్యార్థిని బలిగొన్నాయి. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని జీఎం కాలనీకి చెందిన లక్ష్మన్న కళ్యాణదుర్గంలో సెరికల్చర్ శాఖలో పని చేస్తున్నారు. ఆయనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె హర్షవర్ధిని (17) నగర శివారులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఇటీవల పబ్లిక్ పరీక్షలు రాసింది. అయితే పరీక్షలు తాను సక్రమంగా రాయలేదని, ఆశించిన స్థాయిలో మార్కులు రావేమోననే అనుమానంతో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారి నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఇంటికి చేరుకుని బోరున విలపించారు. ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రార్థనలకు వేదిక ఈద్గా



అనంతపురం కల్చరల్: రంజాన్, బక్రీద్ పర్వదినాలు వచ్చాయంటే నగరంలో వేలాది మంది

- నగరంలో ముస్తాబైన ఈద్గా మైదానాలు
- సామూహిక ప్రార్థనలకు పెద్ద ఎత్తున తరలిరానున్న ముస్లింలు
- అన్ని వసతులు కల్పించిన అధికారులు

సామూహిక ప్రార్థనలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుంది. ఈద్గా మైదానం ప్రధాన పండుగలకు సామూహిక ప్రార్థనలతో ఘనమైన ముగింపు ఇస్తుంది. ఢిల్లీలోని జామా ఈద్గా, హైదరాబాద్‌లోని మీర్ ఆలం ఈద్గాలను గుర్తుకు తెచ్చే నగరానికి చెందిన ఈద్గా మైదానానికి ఘనమైన చరిత్రే ఉందని చెప్పుకోవచ్చు. మహమ్మద్ ప్రవక్త (స) ఆచరించిన విధానాన్ని సున్నత్ (సంప్రదాయం) అంటారు.



ఈద్గా మైదానంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు (ఫైల్)

దాని ప్రకారం ఇస్లాం అత్యంత విశిష్టమైన రెండు పర్వదినాలను సూచించింది. రంజాన్ మాసానంతరం వచ్చే 'ఈద్–ఉల్–ఫిత్ర్' మొదటిది కాగా.. అల్లా ఆజ్ఞతో త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్‌గా పిలువబడే 'ఈద్–ఉల్–అజహా' మరొక పవిత్రమైన పర్వదినం. ఈ రెండు పండుగల రోజున సామూహిక ప్రార్థనలను ఊరి వెలుపల జరపాలన్నది మహమ్మద్ ప్రవక్త(స) ఆదేశం. దానిని ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో పాటిస్తారు. ఇలా ఊరికి బయట ప్రార్థనల కోసం నిర్మించుకున్న మైదానాన్నే 'ఈద్గా' అంటారు.

గతంలో రోడ్లపైనే ప్రార్థనలు..

ప్రతి శుక్రవారం ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేసే రోజు అయినా సంఖ్య పరిమితంగా ఉంటుంది. కాబట్టి సమీపంలో ఉన్న జామియా మసీదు వంటి వాటిలో ప్రార్థనలు చేస్తారు. రంజాన్ వచ్చిందంటే వేలాదిగా తరలివచ్చే ముస్లింలకు సరిపడా మైదానం ఒకనాడు ఉండేది కాదు. స్థానిక లలిత కళాపరిషత్తు పక్కన ఉన్న ఈద్గా మసీదు ఆవరణలోనే ఒకనాడు 1952కు ముందు సామూహిక ప్రార్థనలు జరిగేవి. అప్పుడు ప్రధాన పండుగలు వచ్చాయంటే మసీదు చాలక సప్తగిరి సర్కిల్ అంతా నిండిపోయేది. రోడ్లపైనే ప్రార్థనలు జరిగేవని పెద్దలు చెబుతుంటారు. తర్వాత డ్రైవర్స్ కాలనీలో ప్రస్తుతమున్న నూరానీ మసీదు ఆవరణలో సామూహిక ప్రార్థనలు జరిగేవి. ఇలా మూడు దశాబ్దాలు గడిచాక.. ఏటా పెరిగిపోతున్న జనాభాకు తగిన విధంగా 1985లో ఇప్పటి ఈద్గా మైదానాన్ని నిర్మించుకున్నారు. సుమారు 12 ఎకరాల 9 సెంట్లున్న విశాల ప్రాంగణంలో సామూహిక ప్రార్థనల కోసం ముస్లింలు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పించారు. రంజాన్, బక్రీద్ పర్వదినాలు వచ్చాయంటే 30 నుంచి 35 వేల వరకూ ముస్లింలు ఒకేసారి ప్రార్థనల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. జామియా మసీదు ముతవల్లీల ఆధ్వర్యంలోనే నూరానీ మసీదు, ముస్లిం బరియల్ గ్రౌండ్, మాసుమాబీ దర్గా, షంషీర్ దర్గాలతో పాటు ఈద్గా మసీదు, ఈద్గా మైదానంలో ప్రార్థనలు జరుగుతాయి.

సందర్భం: 31న రంజాన్

ఐకమత్యానికి ప్రతీక నమాజ్

సంవత్సరానికి ఒకసారే అయినా ఈద్గా మైదానంలో జరిపే సామూహిక ప్రార్థనలతో జీవితాంతం భాతృత్వ భావనను పెంపొందిస్తుంది. జిల్‌హజ్ మాసంలో హజ్ యాత్రకు ముందు కాబా (మక్కా) వద్ద జరిపే ప్రార్థనలను పోలిన సామూహిక నమాజ్ ఐకమత్యానికి ప్రతీక. చిన్నా, పెద్దా, పేద, ధనిక బేధాలు మరచి పక్కపక్కనే నిల్చుని మనమంతా ఒక్కటే.. మనమంతా మొక్కాల్సింది ఒకే దైవమన్న తలంపుతో జరిగే ప్రార్థనలకు ఈద్గా ప్రధాన వేదిక అవుతోంది. అందరి కోర్కెలను తీర్చే పవిత్ర స్థలంగా రూపుదిద్దుకోవడం చాలా ఆనందం. ఈ రంజాన్ పండుగ సందర్భంగా సామూహిక ప్రార్థనలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటాం.

– షఫీవుల్లా, ముతవల్లి, జామియా మసీదు

దాన ధర్మాలకు ప్రతీక రంజాన్



ముస్లింలతో కలసి ప్రార్థనలు చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం రూరల్: దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ మాసమని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ భవన్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఉండటం గొప్ప విషయన్నారు. ఉపవాసాల వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం పొందుతారన్నారు. కార్యక్రమంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు పాల్గొన్నారు.

రేపు ఉగాది సంబరాలు

అనంతపురం కల్చరల్: విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈనెల 30వ తేదీన లలిత కళా పరిషత్తులో సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎల్కేపీ కార్యదర్శి గాజుల పద్మజ తెలిపారు. గరుడాద్రి సురేష్ శర్మ పంచాంగ శ్రవణం, పేరెన్నికగన్న కవులతో ఉగాది ప్రాశస్త్యానిన తెలిపే కవి సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. కళాస్థలానికి విశేష సేవలందించిన వారికి ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉగాది పురస్కారాలు అందజేస్తామని వెల్లడించారు.

కృష్ణకళా మందిరంలో..

నగరంలోని కృష్ణకళా మందిరంలో ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మైఖేల్ బాబు తెలిపారు. ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా కలెక్టర్‌తో పాటూ ఉమ్మడి జిల్లా మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు ఉత్సవాలను ప్రారంభిస్తారన్నారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం ఆధ్వర్యంలో నాట్య ప్రదర్శనలు, సినీ సంగీత విభావరి, శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన ఉంటాయన్నారు. అనంతరం ముఖ్య అతిథుల చేతులమీదుగా కళాకారులకు జ్ఞాపికలు అందజేయడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

లక్ష్యసాధనకు శ్రమించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణా రెడ్డి

అనంతపురం: శాస్త్రసాంకేతిక మార్పులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు అనివార్యమని డిప్యూటీ కలెక్టర్ రామకృష్ణా రెడ్డి అన్నారు. అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. లక్ష్యసాధనకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ పాఠశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మెన్ రమేష్ నాయుడు, పాఠశాల సీఏఓ నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

సీఐ కరుణాకర్ బదిలీ ఆపాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాజకీయ ఆధిపత్యం కోసం బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్‌ను అక్రమంగా బదిలీ చేయడం దారుణం. వెంటనే ఆయన బదిలీని ఆపాలని భారతీయ భీమసేనా వ్యవస్థాపక అధ్యక్షుడు జై భీమ్ రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శింగనమల నియోజక వర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్న కూడా అక్కడ టూమెన్ కమిటీ వేసి ఇరువర్గాల మధ్య రాజకీయ ఆధిపత్యం కోసం సీఐని అక్రమంగా బదిలీ చేయడం దుర్మార్గమన్నారు. దళిత అధికారులను టార్గెట్ చేయడం సరికాదన్నారు. వెంటనే బదిలీ ఆపకపోతే దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీజీపీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాకెట్ల చందునాయక్, పామిడి ఓబులేసు, జలాలపురం గుజ్జల పోతలయ్య పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాల వితరణ




ఆర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులను సత్కరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద పలు కంపెనీలు డ్రోన్ కెమెరాలను వితరణ చేయడం హర్షణీయమని ఎస్పీ జగదీష్ కొనియాడారు. శుక్రవారం రూ.18.17 లక్షల విలువ చేసే 10 డ్రోన్ కెమెరాలను ఆర్జాస్ స్టీల్ కంపెనీ ప్రతినిధులు అందజేశారు. ఆర్జాస్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ హెడ్ ఎం.నరేందర్, రిలేషన్ మేనేజర్ ఆర్.వెంకటేష్‌ను ఎస్పీ జగదీష్ సన్మానించారు.

నలంద డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

అనంతపురం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్తంగా శుక్రవారం నగరంలోని నలంద డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు 14 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. 156 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా.. 94 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్ రెడ్డి, నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జాబ్ డిస్ట్రిక్ మేనేజర్ సూర్యనారాయణ, నైపుణ్యాభివృద్ధి కార్యాలయ సిబ్బంది జగన్, రఫీ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పరిశోధనలపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డాక్టర్ డీఆర్ ప్రసాదరాజు

అనంతపురం: నాణ్యమైన పరిశోధనల వైపు దృష్టి సారించాలని భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సంస్థకు చెందిన విశ్రాంత శాస్త్రవేత్త, జేఎన్‌టీయూ అనంతపురం పూర్వ విద్యార్థి డాక్టర్ డీఆర్ ప్రసాద రాజు అన్నారు. శుక్రవారం ఓటీపీఆర్ఐలో బోధనా సిబ్బందికి వివిధ ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సంస్థల ద్వారా అందిస్తున్న పరిశోధన అవకాశాలు, నిధులు పొందేందుకు కావాల్సిన అర్హతలు, విధివిధానాలపై వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ స్పాన్సర్ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

40 మంది గైర్హాజరు

రాప్తాడు: మండలంలో నాలుగు సెంటర్లలో శుక్రవారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 40 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. 1,109 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 1,069 మంది హాజరయ్యారని తెలిపారు. సెంటర్ల వద్ద సీఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. జిరాక్స్ సెంటర్లను బంద్ చేయించారు.

న్యాయమైన పరిహారం చెల్లించాల్సిందే



రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నిర్వాసితులు

అనంతపురం అర్బన్: జాతీయ రహదారి 544డీ నిర్మాణ క్రమంలో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ప్రస్తుత ధరల ప్రకారం న్యాయమైన పరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తరిమెల నాగరాజు, చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్వాసితులతో కలసి కలెక్టరేట్ ఎదట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణంలో తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రైతులు, కూలీలు ఇళ్లను కోల్పోతున్నారన్నారు. 2018లో అధికారులు సర్వే చేసి రోడ్డు విస్తరణలో ఇళ్లు పోతాయని చెప్పారన్నారు. ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తామని.. ధర మీద రెట్టింపు పరిహారం ఇస్తామని గ్రామసభలో రెవెన్యూ అధికారులు చెప్పినట్లు గుర్తు చేశారు. ఇక పట్టా భూమికి, అసైన్డ్ భూమికీ ఒకే పరిహారం ఇస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. 2018 ధరలకు అనుగుణంగా ధర నిర్ణయించి రెండు రెట్లు అధికంగా ఇస్తామని చెప్పి ఇవ్వకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈనెల 27న కొందరికి 2018లోని మార్కెట్ విలువ అంచనా ప్రకారం చెల్లించారన్నారు. పరిహారానికి సంబంధించిన జాబితా ఎవరికీ తెలియకుండా చేసి బాధితులకు అన్యాయం చేశారని తెలిపారు. పరిహారం విషయంలో నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు విరుపాక్షి, బీహెచ్‌రాయుడు, నిర్వాసితులు రంగారావు, శివశంకర్, శ్రీనాథ్, జయమ్మ, పుష్పావతి, అంజనమ్మ, నారాయణ స్వామి, కాసీం పీరా, నవీన్, బ్రహ్మయ్య, సురేంద్ర, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ గడువు పెంచాలి



కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పార్టీ విద్యార్థి విభాగం నాయకులు

అనంతపురం అర్బన్: పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రేషన్ కార్డులకు సంబంధించి ఈ–కేవైసీ నమోదు గడువును ప్రభుత్వం పొడిగించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు చాలా మంది ఈ–కేవైసీ నమోదు చేయించుకోలేదన్నారు. ఈ–కేవైసీ నమోదు గడువు ఈనెల 31వ తేదీతో ముగుస్తున్నందున వారు తమ గ్రామాలకు వెళ్లి ఈ–కేవేసీ చేయించుకునే పరిస్థితి లేదని గుర్తు చేశారు. ఈ–కేవైసీ నమోదు చేసుకోని కారణంగా భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు ప్రధానంగా ఫీజురీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం, ఉపకార వేతనం, తదితర వాటికి పేద విద్యార్థులు దూరమవ్వాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గడువును మే నెల వరకు పొడిగించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు ఈ–కేవైసీ నమోదుకు సచివాలయ సిబ్బందితో లేదా రేషన్ డీలర్లతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో విభాగం నగర అధ్యక్షుడు కైలాష్, నాయకులు వెంకట్, నిశాంత్‌రెడ్డి, వంశీనాయుడు, నారాయణరెడ్డి, సాకే మురళి, మహేష్ రెడ్డి, సూర్య, శేఖర్, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదలపై విద్యుత్ చార్జీల భారం మోపొద్దు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఇంధనపు సర్దుబాటు, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతోందని మండల సీపీఎం నాయకులు తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కదిరప్ప మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా కరెంట్ చార్జీలు పెంచమని కూటమి పార్టీల నాయకులు ప్రస్తుతం ఇంధనపు, ట్రూ ఆఫ్ పేరుతో చార్జీలను పెంచుతున్నారన్నారు. వీటితో పాటు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి నిరుపేద కుటుంబాలు, రైతులపై భారాన్ని మోపుతున్నారని మండిపడ్డారు. వీటిని వెంటనే రద్దు చేయకపోతే సీపీఎం తరఫున ఆందోళన చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

‘యురేకా సైన్స్ ఎక్స్ పో–2025’లో సత్తా



ప్రతిభ కనబరిచిన లహరి, యశస్విని, ప్రహర

అనంతపురం ఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో యురేకా సైన్స్ ఎక్స్ పో–2025 పేరిట ఆన్‌లైన్‌లో నిర్వహించిన వినూత్న ప్రయోగాల పోటీల్లో నగరంలోని లక్ష్మీ సినర్జీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అలాగే ప్రశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతులకు ఎంపికయ్యారని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షుడు ఎం.రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం–సుస్థిర అభివృద్ధి, మూడు నమ్మకాలు–శాస్త్రీయ దృక్పథం' వంటి అంశాలపై తక్కువ ఖర్చు, ఖర్చు లేకుండా 8, 9, 10 తరగతి విద్యార్థుల నుంచి రాష్ట్రస్థాయిలో వినూత్న ప్రయోగాలను ఆన్‌లైన్‌లో ఆహ్వానించింది. 'పర్యావరణం సుస్థిర అభివృద్ధి' అంశంపై ప్రయోగం చేసిన లక్ష్మీ సినర్జీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు జి.లహరి, టి.యశస్విని, డి.ప్రహర్ష, 'మూడు నమ్మకాలు–శాస్త్రీయ దృక్పథం' అంశంపై ప్రశాంతి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు వై.అమృత వర్షిని, జె.మౌనిక, ఎస్.గౌస్ పీర్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 386 వీడియో ప్రయోగాలు వచ్చాయని తెలిపారు. పర్యావరణాన్ని ఎలా రక్షించుకోవాలి, మూఢనమ్మకాలకు సంబంధించి మన జిల్లా విద్యార్థులు చేసిన ప్రయోగాలు ఎంతో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. త్వరలో విద్యార్థులకు సర్టిఫికెట్స్, బహుమతులు అందజేస్తామని వెల్లడించారు.

ముస్లింలకు పవిత్ర పండుగ రంజాన్



భోజనం వడ్డిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, నదీమ్ అహమ్మద్

శింగనమల: ముస్లింలకు ఎంతో పవిత్రమైన పండుగ రంజాన్ మాసమని వైఎస్సార్‌సీపీ ఎస్ఆర్ఐ విభాగ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని శుక్రవారం ఎస్ఆర్ఐటీలో మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, పార్టీ ఎస్ఆర్ఐ కో–ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన ముస్లింలతో పాటు నమాజ్‌లో పాల్గొన్నారు. అనంతరం అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ మాజీ చైర్మన్ నదీం అహమ్మద్, శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు, నియోజకవర్గంలోని ముస్లింలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

సిండికేట్ నగర్‌లో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్ నూరానీ మసీదులో శుక్రవారం సాయంత్రం సర్పంచ్ బండా అంజియాదవ్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో ముస్లింలు ఉపావాసాలు ఉంటున్నారని అంజియాదవ్ పేర్కొన్నారు. అలాంటి వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసే అవకాశం లభించడం తన అదృష్టం అన్నారు. ముస్లింలందరిపై అల్లాహ్ కరుణకటాక్షలు ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గౌస్, ముతవల్లి చాంద్‌బాషా, వైస్ ముతవల్లీ కుళ్లాయప్ప, క్యాషియర్ కుళ్లాయప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మార్గదర్శకులుగా నిలవాలి



అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు

అనంతపురం: పేదరికాన్ని రూపుమాపే సమాజ మార్గదర్శకులుగా నిలవాలని ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు సూచించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని 'సెంటర్ ఫర్ సోషల్ ఇంక్లూజన్ ఆధ్వర్యంలో 'గిరిజనుల సమూహాల సామాజిక, ఆర్థిక సాధికారిత అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై గత రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. యువ పరిశోధకులు క్షేత్రస్థాయిలో పరిశోధన చేసి రాబోయే తరాలకు దోహదపడే పథకాల గురించి తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఏవీ రమణ, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, సోషల్ ఇంక్లూజన్ అసిస్టెంట్ డైరెక్టర్లు డాక్టర్ కే.వెంకట రెడ్డి, డాక్టర్ డి.శ్రీనివాస రావు, సిబ్బంది టి.కృష్ణా రెడ్డి, ప్రశాంత్, డాక్టర్ కొండారెడ్డి, పద్మావతి, నర్మద, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల నిర్వహణకు వేలం

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి బాట సుంకులమ్మ ఆలయ ఆవరణలోని దుకాణాల నిర్వహణకు అధికారులు వేలం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి ఎనిమిది మంది పాటదారులు పాల్గొన్నారు. మూడేళ్ల పాటు దుకాణాల నిర్వహణకు యజమానులు 14 గదులకు ప్రతి నెలా రూ.1.15 లక్షలు అద్దె చెల్లించేలా వేలంలో దక్కించుకున్నారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌నాయుడు, రంగస్వామి, వెంకట్రాముడు, నరశింహులు, వెంకటనాయుడు, గుర్రప్ప, చిన్నరంగస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివబాలయోగి ఆరాధన



అలంకరణలో శివబాలయోగి మహారాజ్ విగ్రహం



సద్గురువుల రజిత పాదుకలను ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో శుక్రవారం సద్గురువుల 31వ ఆరాధన మహోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, విశేష ద్రవ్యాలతో, చందన అభిషేకాలు, సామూహిక అర్చనల అనంతరం మూలమూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుష్పార్చన అనంతరం పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్త బృందాలు సద్గురువుల రజిత పాదుకలను తలపై మోస్తూ నగరవీధుల్లో ఊరేగించారు. అలాగే శివబాలయోగి మహారాజ్ చిత్రపటంతో పల్లకీ సేవ, ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన బృందాల మధుర గీతాలపనల కచేరీ జరిగింది. మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం అనంతరం నారాయణ సేవ నిర్వహించారు. ఆశ్రమ కమిటీ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి దేవరాజ్ మాట్లాడుతూ.. మహాతపస్విగా దేశ విదేశాలలో శివబాలయోగి మహారాజ్ ఆశ్రమాలు ఉన్నాయని తెలిపారు. అనంతలో వివిధ సేవా కార్యక్రమాలు సాగుతున్నాయన్నారు. సాయంత్రం భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి జరిగిన ఊంజల సేవకు భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు మల్లికార్జున, ప్రసాద్, లక్ష్మీనారాయణ, చెన్నకేశవులు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పుట్టపర్తి నారాయణాచార్యులు

అనంతపురం కల్చరల్: పుట్టపర్తి నారాయణాచార్యుల సాహిత్యం అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి సందర్భంగా అనంత సాహితీ సంస్థల ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ కవులు టీవీరెడ్డి, మహాబోధి కృష్ణమూర్తి, రియాజుద్దీన్, చెట్ల ఈరన్న, తదితరులు మాట్లాడారు. శివతాండవంతో అనంత ఖ్యాతిని ఘనంగా చాటిన పుట్టపర్తి నారాయణాచార్యులు ఎంతో మంది కవులకు స్ఫూర్తినందించారని కొనియాడారు. అనంతరం డాక్టర్ అంకె రామలింగమయ్య, డాక్టర్ వెంకటసుబ్బయ్య ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జయరాములు, ప్రవీణ్, ఆంజనేయులు, శ్రీనివాసులు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రజిని సేవలు మరువలేనివి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని సేవలు మరువలేనివని హాస్పిటల్ ఏడీ మల్లికార్జున రెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ ఆత్మారాం పేర్కొన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో ఉద్యోగ విరమణ సందర్భంగా గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజినికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా స్టాఫ్‌నర్సు, హెడ్‌నర్సు, గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సేవలందించడం గొప్ప విషయమన్నారు. గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి మాట్లాడుతూ.. రజిని మృదు స్వభావి అని, విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పని చేశారని కొనియాడారు. రజిని మాట్లాడుతూ 30 ఏళ్లకుపైగా నర్సింగ్‌లో వివిధ హోదాల్లో సేవలందించడం జరిగిందన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ రోగుల ప్రాణాలకు కాపాడడమే ధ్యేయంగా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. తన వృత్తి ఎంతో సంతృప్తినందించిందన్నారు. విజయవంతంగా విధులు నిర్వర్తించడంలో కుటుంబీకుల ప్రోత్సాహం ఎనలేదని వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, కార్డియాలజిస్టు డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.


IV

సాక్షి ఫ్యామిలీ

అనంతపురం

శనివారం ॥ 29-3-2025







తెలుగువారి తొలి పండగ వచ్చేస్తోంది. నూతనోత్సాహంతో ఉగాదిని ఆహ్వానించడానికి సిద్ధమవుతున్న వేళ... కొత్త తరానికి పండగల అర్థం తెలుస్తోందా? అంటే... 'పెద్దవాళ్లు చెబితేనే తెలుస్తుంది' అంటున్నారు ప్రముఖ రచయితలు రామజోగయ్య శాస్త్రి, అనంత శ్రీరామ్. ఉగాది ప్రత్యేకంగా ఇంకా ఈ ఇద్దరూ చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.

కొత్త తరానికి చెబుదాం

- రామజోగయ్య శాస్త్రి

పండగలు జరుపుకోవడం ఎవరూ మానేయలేదు. పిండివంటలు చేసుకోవడానికైనా పండగలు చేసుకుంటున్నాం. పండగ పూట తల స్నానం చేసి, ఉగాది పచ్చడి తిన్న తర్వాతే మిగతా పనులు చేయాలని పిల్లలకు పెద్దలు చెప్పాలి. ఎప్పటికప్పుడు కొత్త తరానికి పాత తరంవాళ్లు చెబుతుండాలి. ఎందుకంటే పండగలన్నీ ముందు తరంవాళ్లు చేసుకుంటూ వచ్చారు కాబట్టి చెప్పడం వారి బాధ్యత. కొత్త తరాన్ని పాజిటివ్‌గా స్వాగతించాలి. వారూ వెల్‌కమింగ్‌గానే ఉంటారు. మన తానులో పెరిగిన ముక్కలు వేరేలా ఎలా ఉంటారు? కొత్త తరానికి పద్ధతులన్నీ కొత్తే. పోనీ ఇవాళ్టి పాత తరం అనుకున్నవారికి ఎవరు చెప్పారు? వారి ముందు తరంవారు చెబితేనే కదా వీరికి తెలిసింది. ఇది రిలే పందెంలాంటిది. ఒక తరానికి ఒక తరానికి సక్రమంగా విషయాలను అందజేయాల్సిన బాధ్యత ముందు తరానికి ఉంటుంది.

యువతని నిందించడం సరికాదు: ప్రపంచాన్ని రెండు రకాలుగా చూడొచ్చు. మంచి కోణంలో... దుర్మార్గపు కోణంలో... ఎప్పుడూ మొదటి కోణంలో చూస్తే మంచిది. అది కాదనుకుని యువత పెడదారి పట్టిందని, ఏదేదో జరిగిపోతోందని యువతరాన్ని నిందించడం సరికాదు. ఏదీ వక్రీకరించిన కోణంలో చూడొద్దు. ఫారిన్ కల్చర్ అంటున్నాం... విదేశాలు వెళ్లి చూస్తే ఇక్కడికన్నా ఎక్కువ అక్కడ పండగలు బాగా జరుపుకుంటున్నారు. అన్నమాచార్యుల కీర్తనలు కూడా పాడుతున్నారు. ఇక్కడితో పోల్చితే అమెరికా ఫాస్ట్ ఫార్వార్డ్ అనుకోవాలి కదా. కానీ అక్కడ మన సంప్రదాయాలు బతికే ఉన్నాయి. ఇక ఎప్పటికీ ఇండియా రామని తెలిసిన కుటుంబాలు కూడా తమ పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నారు... మన సంప్రదాయాల గురించి చెబుతున్నారు. పిల్లలూ నేర్చుకుంటున్నారు.

యువతరం బాధ్యతగా ఉంటోంది: సారవంతమైన నేల అది (యువతరాన్ని ఉద్దేశించి). బీజం వేయడం అనేది మన చేతుల్లో ఉంది. ముందు తరం బాధ్యతగా ఉండి, తర్వాతి తరానికి దగ్గరుండి అన్నీ నేర్పించి, అన్నీ ఆచరించేలా చేయాలి. వీళ్లు పాటిస్తూ వాళ్లు పాటించేలా చేయాలి. పొద్దున్నే వీళ్లు స్నానం చేయకుండా... పిల్లలను స్నానం చేసి, పూజలు చేయమంటే ఎందుకు చేస్తారు? నువ్వు చేయడంలేదు కదా? అంటారు. ఒకవేళ మాటల రూపంలో చెప్పకపోయినా... ముందు తరం ఆచారాలు పాటిస్తుంటే వీళ్లు చూసి, నేర్చుకుంటారు... అనుసరించడానికి ఇష్టపడతారు. బోధించే విధానం సక్రమంగా ఉండాలి. ఫైనల్‌గా చెప్పేదేంటంటే... మనం అనుకున్నంతగా యువతరం ఏమీ దిగజారిపోలేదు. చెప్పాలంటే మనకన్నా ఇంకా బాధ్యతగా ఉంటూ, పాతా కొత్తా బ్యాలెన్స్ చేసుకుంటూ వెళుతున్నారు. ఈ కాలపు పిల్లలు ఇంటికీ, బయటికీ పర్ఫెక్ట్ బ్యాలెన్స్ తెలిసిన వాళ్లు. వాళ్లలో ఏదైనా లోపం ఉందీ అంటే... చెప్పేవాళ్లదే కానీ వాళ్లది కాదు. సో... ఏ పండగని ఎందుకు జరుపుకోవాలో విడమర్చి యువతరానికి చెప్పాల్సిన బాధ్యత ముందు తరానిదే. సంవత్సరాది ఎందుకు జరుపుకుంటున్నాం? ఉగాది పచ్చడి విశిష్టత వంటివి చెప్పి, పండగ అర్థం తెలియజేయాలి.

పండగ 'రుచి' చూపాలి

- అనంత శ్రీరామ్

పండగలు జరుపుకునే తీరు మారింది. పెళ్లిళ్లల్లో ఎప్పుడైతే మనకు లేని రిసెప్షన్ అని మొదలుపెట్టామో అలానే పండగలు జరుపుకునే తీరులోనూ మార్పు వచ్చింది. ఉగాది గురించి చెప్పాలంటే... మా ఊరులో ఐదు రోజులు ఉగాది జాతర జరుగుతుంది. మాది వెస్ట్ గోదావరి, యలమంచిలి మండలం, దొడ్డిపట్ల గ్రామం. జాతర సందర్భంగా ఊరేగింపులు అవీ చేస్తుంటారు. ఇప్పుడూ జరుగుతున్నాయి. కానీ ఇప్పుడు జాతరలో భాగంగా మేజిక్ షోస్ అంటూ వెస్టన్ కల్చర్ మిక్స్ అయిపోయింది. ఉగాది అంటే కవి సమ్మేళనాలు విరివిగా జరిగేవి. ఇప్పుడలా లేదు. ఎవరైనా విద్యావంతులు లేదా శాంతి సమాఖ్యలు వాళ్లు ఏదో టౌన్ హాలులో కవి సమ్మేళనాలు ఏర్పాటు చేసినా ఓ ఇరవై ముప్పైమంది ఉంటున్నారు... అంతే.

ఉగాది ప్రత్యేకం అమ్మవారి జాతర: ఇక మా ఊరి ఉగాది గురించి చెప్పాలంటే... మాణిక్యాలమ్మ మా గ్రామ దేవత. ఉగాది సమయంలో మాకు ఆ అమ్మవారి జాతర ఉంటుంది. ఉగాది ప్రత్యేకం అంటే ఆ జాతరే. ఐదు రోజులు ఘనంగా చేస్తారు. ఐదో రోజు అయితే అమ్మవారిని బాగా అలంకరించి, ఊరేగించి, తెప్పోత్సవం చేస్తారు. నేను ప్రతి ఏడాది దాదాపు మిస్ కాకుండా వెళతాను. ఈసారి కుదరదు.

ఆరు రుచులను సమానంగా ఆస్వాదించాలి: ఉగాది పచ్చడిలోని షడ్రుచుల గురించి చెప్పాలంటే... నేను 'ఒక్కడున్నాడు' సినిమాలో 'ఇవ్వాళ నా పిలుపు... ఇవ్వాలి నీకు గెలుపు... సంవత్సరం వరకు ఓ లోకమా...' అని పాట రాశాను. అది పల్లవి. పాట మొదటి చరణంలో రుచుల గురించి రాశాను. 'కొంచెం తీపి... కొంచెం పులుపు పంచే ఆ ఉల్లాసమూ... కొంచెం ఉప్పు... కొంచెం కారం పెంచే ఆ ఆవేశమూ... చేదూ వగరూ చేసే మేలూ... సమానంగా ఆస్వాదించమని ఇవ్వాళ నా పిలుపు' అని రాశాను. ఆరు విభిన్నమైన రుచులను సమానంగా ఆస్వాదిస్తేనే జీవితాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలమని చెప్పడమే ఆ పాట ఉద్దేశం. అంటే... జీవితంలో ఎదురయ్యే పరిస్థితులన్నింటినీ సమానంగా స్వీకరించగలగాలి.

ఆ బాధ్యత పెద్దవాళ్లదే: ఇక నేటి తరం గురించి చెప్పాలంటే... ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలతో హాలోవెన్ అంటూ రకరకాల వేషాలు వేయిస్తున్నారు. వేలంటైన్స్ డే అనీ ఇంకా వేరే ఎక్కడెక్కడ నుంచో తెచ్చిపెట్టుకున్న పండగలను జరుపుతున్నారు. అయితే పిల్లలకు మన పండగల గురించి చెప్పాలి. వేరే సంబరాలు ఎలా ఉన్నా కూడా మన పండగలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇలా పాత తరం ఆచరిస్తే కొత్త తరానికి అర్థం అవుతుంది. వాళ్లు మన సంస్కృతీ సంప్రదాయాలను ముందుకు తీసుకెళతారు. మా గ్రామంలో ఉగాది అంటే... ఇంట్లో పిల్లలకు వేప పూత, మామిడికాయలు, చెరుకు గడలు తెమ్మని టాస్కులు ఇచ్చేవారు. అవి తెచ్చే క్రమంలో మాకు పండగలు అర్థమయ్యేవి. అలా మా ముందు తరంవాళ్లు మాకు నేర్పించారు. కొత్త తరానికి మనం అలా నేర్పిస్తే వాళ్లు పాటిస్తారు. ముందు తరాలకు సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించే బాధ్యత పెద్దవాళ్లదే.

- డి.జి. భవాని

6 రుచులు ఆరోగ్య లాభాలు

ఉగాది పచ్చడిని సేవించే ఆచారం శాలివాహన శకారంభం నుంచి మొదలైనట్లుగా చరిత్రకారులు చెబుతారు. సంప్రదాయ పద్ధతిలో ఉగాది పచ్చడిని కొత్త మట్టికుండలో తయారు చేస్తారు. ఉగాది పచ్చడిలో వేపపూత, మామిడి పిందెలు, చింతపండు, ఉప్పు, మిరియాల పొడి, బెల్లం, అరటిపండు ముక్కలు ఉపయోగిస్తారు. వీటి వల్ల ఉగాది పచ్చడి ఆరురుచుల సమ్మేళనంగా తయారవుతుంది. ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం....

బెల్లం, అరటి పండ్లు- తీపి

బెల్లం తీపిగా ఉంటుంది. ఎండ వేడిమి వల్ల కలిగే అలసటను పోగొట్టి, తక్షణ శక్తినిస్తుంది. బెల్లాన్ని అరటిపండుతో కలిపి తీసుకోవడం శ్రేష్ఠమని ఆయుర్వేదం చెబుతోంది. అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలను అరటి పండు నిరోధిస్తుంది.

చింతపండు- పులుపు

ఉగాది పచ్చడి తయారీకి పాత చింతపండు ఉపయోగించడం మంచిది. పాత చింతపండు ఉష్ణాన్ని, వాత దోషాలను తగ్గిస్తుంది. బడలికను పోగొడుతుంది. జఠరశక్తిని పెంచుతుంది. మూత్రవిసర్జన సజావుగా సాగేందుకు దోహదపడుతుంది. వేసవిలో చింతపండు రసం తీసుకోవడం వల్ల ఉష్ణదోషాలు తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

ఉప్పు

రుచులకు రారాజులాంటిది ఉప్పు. ఉప్పులేని పప్పులు, కూరలు, పచ్చళ్లు రుచించవు. ఆహారంలో అనునిత్యం ఉపయోగించే ఉప్పు త్రిదోషాలను- అంటే, వాత పిత్త కఫ దోషాలు మూడింటినీ పోగొడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. అయితే, ఉప్పును మోతాదులోనే వాడాలి.

మామిడి పిందెలు- వగరు

మామిడి కాయలు ముదిరితే పులుపుగా ఉంటాయి గాని, పిందెలు వగరుగా ఉంటాయి. మామిడి పిందెల వగరుదనం లేకుంటే, ఉగాది పచ్చడికి పరిపూర్ణత రాదు. మామిడి పిందెలలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. మామిడి పిందెలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని త్రిదోషాలను హరించి, శక్తిని కలిగిస్తాయని ఆయుర్వేదం చెబుతోంది.

వేపపూలు- చేదు

వసంతారంభంలో వేపపూలను తినే ఆచారం దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. దీనిని 'నింబకుసుమ భక్షణం' అంటారు. షడ్రసోపేతమైన ఉగాది పచ్చడిలో వేపపూలను ఉపయోగించడం మన తెలుగువాళ్లకే చెల్లింది. వేపపూలు కఫదోషాన్ని, క్రిమిదోషాలను పోగొడతాయి. జీర్ణకోశ సమస్యలను నివారిస్తాయి.

మిరియాల పొడి-కారం

మిరియాలను నేరుగాను, పొడిగాను వంటకాల్లో తరచుగా వినియోగిస్తూనే ఉంటాం. మిరియాలు రుచికి కారంగా ఉన్నా, శరీరానికి చాలా మేలు చేస్తాయి. మిరియాలు కఫదోషాన్ని, విష దోషాలను హరిస్తాయి. చర్మవ్యాధులను అరికట్టడమే కాకుండా, జీర్ణశక్తిని, శరీరంలోని జీవక్రియలను పెంచుతాయి. అందుకే సంప్రదాయ ఆయుర్వేద ఔషధాల్లో మిరియాలను విరివిగా ఉపయోగిస్తారు.



ఉగాది పచ్చడి

కావలసినవి: కొత్త బెల్లం – 100 గ్రాములు, పచ్చి మామిడి – ఒకటి (మీడియం సైజు), వేప పువ్వు – ఒక టేబుల్ స్పూన్, పచ్చి మిర్చి – రెండు (తురమాలి), ఉప్పు – చిటికెడు, చింతపండు – పెద్ద నిమ్మకాయంత (కొత్త చింతకాయల నుంచి సేకరించినది).

తయారీ: ● బెల్లాన్ని తురిమి, అందులో కొద్దిగా నీటిని చిలకరించి పక్కన ఉంచాలి. ● వేప పువ్వు కాడలు లేకుండా వలిచి పువ్వు రెక్కలను సేకరించి పక్కన ఉంచాలి. ● మామిడి కాయ మొదలు (సొన కారే భాగం) తీసేయాలి. కాయను నిలువుగా కోసి లోపలి గింజను కూడా తీసేయాలి. ఇప్పుడు మామిడి కాయను తొక్కతోపాటు సన్నగా ముక్కలు తరగాలి లేదా తురిమి బెల్లం నీటిలో వేయాలి. ● చింతపండు గుజ్జును చిక్కగా రసం తీసి పై మిశ్రమంలో కలపాలి. అందులో పచ్చిమిర్చి తురుము, ఉప్పు, వేప పూత వేసి కలపాలి. ఈ మిశ్రమం చిక్కగా ఉంటుంది. మరింత రుచి కోసం చెరకు ముక్కలు, మిగుల మగ్గిన అరటి పండు గుజ్జు కలుపుకోవచ్చు.

పూర్ణాలు



కావలసినవి: పచ్చిశనగ పప్పు – అర కేజీ, బెల్లం – అర కేజీ, యాలక్కాయలు – పది, బియ్యం – రెండు కప్పులు, పొట్టుతీసిన మినప గుళ్లు – కప్పు, ఉప్పు – రుచికి సరిపడా, ఆయిల్ – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ముందుగా మినప పప్పు, బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరుగంటల పాటు నానబెట్టుకోవాలి. శనగ పప్పుని కూడా కడిగి గంట పాటు నానబెట్టాలి ● నానిన బియ్యం మినప పప్పులని మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి ● నానిన శనగ పప్పుని కుకర్‌లో వేసి రెండు గ్లాసులు నీళ్లుపోసి మూడు విజిల్స్ రానివ్వాలి ● ఉడికిన శనగ పప్పులో బెల్లం వేసి మెత్తగా గరిటతో తిప్పుతూ దగ్గర పడేంత వరకు ఉడికించి, యాలుక్కాయల పొడి వేసి తిప్పి దించేయాలి ● శనగపప్పు మిశ్రమం చల్లారాక, ఉండలుగా చుట్టుకోవాలి ● బియ్యం, మినపగుళ్ల రుబ్బులో కొద్దిగా ఉప్పు వేసి తిప్పాలి. ఇప్పుడు శనగ పప్పు ఉండలను ఈ పిండిలో ముంచి ఆయిల్‌లో డీప్ ఫ్రై చేయాలి ● మీడియం మంట మీద గోల్డెన్ బ్రౌన్ రంగులోకి మారేంత వరకు వేయిస్తే తియ్యని పూర్ణాలు రెడీ.

పరమాన్నం



కావలసినవి: బియ్యం – అర కప్పు, పాలు – కప్పు, బెల్లం తురుము – ముప్పావు కప్పు, నెయ్యి – ముప్పావు కప్పు, జీడి పప్పు పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – అర టీస్పూను, పచ్చకర్పూరం – చిటికెడు.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని కడిగి పదిహేను నిమిషాల పాటు నానబెట్టుకోవాలి ● ఒక గిన్నెలో పాలుపోసి కాయాలి. కాగిన పాలల్లో నానబెట్టిన బియ్యం వేసి తిప్పుతూ ఉడికించాలి. అన్నం మెత్తగా ఉడికాక దించి చల్లారనివ్వాలి ● స్టవ్ మీద మరో బాణలి పెట్టుకుని నెయ్యి వేయాలి. నెయ్యి వేడెక్కిన తరువాత జీడి పప్పు పలుకులు వేసి గోల్డ్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి ● స్టవ్ మీద మరో పాత్ర పెట్టి బెల్లం తురుము వేయాలి. దీనిలో పావుకప్పు నీళ్లుపోసి సిరప్‌లా మారేవరకు ఉడికించి, చల్లారనివ్వాలి ● బెల్లం సిరప్‌లోనే యాలకుల డి, పచ్చ కర్పూరం వేసి తిప్పాలి ● బెల్లం సిరప్ చల్లారక అన్నంలో వేసి బాగా కలపాలి, దీనిలో మిగిలిన నెయ్యి, జీడిపప్పుతో గార్నిష్ చేస్తే పరమాన్నం రెడీ.

మామిడి కాయ పులిహోర



కావలసినవి: బియ్యం – కప్పు, పచ్చిమామిడి కాయ – మీడియం సైజుది ఒకటి, పచ్చికొబ్బరి తురుము – అర కప్పు, ఆవాలు – టీస్పూను, మినప పప్పు – టీస్పూను, పచ్చి శనగ పప్పు – టీ స్పూను, వేరుశనగ గుళ్ళు – రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు – మూడు రెమ్మలు, పచ్చిమిర్చి తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి – నాలుగు, మెంతులు – పావు టీస్పూను, ఆయిల్ – నాలుగు టేబుల్ స్పూన్లు, పసుపు – పావు టీస్పూను, చింతపండు ఉసిరికాయంత, బెల్లం తురుము – రెండు టీస్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అన్నం పొడి పొడిగా వచ్చేలా వండి ఆరబెట్టుకోవాలి ● మామిడి కాయ తొక్క తీసి ముక్కలుగా తరగాలి ● ఎండు మిర్చి, మెంతులు, అరటీస్పూను ఆవాలను దోరగా వేయించుకుని పొడిచేయాలి. ఈ పొడిలో పచ్చికొబ్బరి, మామిడికాయ ముక్కలు, చింతపండు, బెల్లం వేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కనపెట్టుకోవాలి ● స్టవ్ మీద బాణలి పెట్టి ఆయిల్ వేయాలి. ఆయిల్ వేడెక్కిన తరువాత ఆవాలు వేయాలి. చిటపటలాడాక మినప పప్పు, శనగ పప్పు, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేయాలి ● ఇవన్నీ వేగాక వేరుశనగ గుళ్ళు వేసి వేయించాలి. ఇవి వేగాక పసుపు, గ్రైండ్ చేసిన మామిడికాయ మిశ్రమం వేసి ఐదు నిమిషాలు వేయించాలి ● తరువాత రుచికి సరిపడా ఉప్పు వేసి, ఆరబెట్టిన అన్నాన్ని వేసి కలిపితే మామిడికాయ పులిహోర రెడీ.

వృథాని జీరో చేద్దాం

యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ... మార్చి నెల 30వ తేదీని జీరో వేస్ట్ డే గా గుర్తిస్తూ 2022, డిసెంబర్ 14వ తేదీన ఒక తీర్మానాన్ని చేసింది. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ అప్పటి నుంచి మార్చి నెల 30వ తేదీని 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో వేస్ట్'గా గుర్తిస్తూ ప్రపంచాన్ని చైతన్యవంతం చేస్తోంది. ఈ ఏడాది ఫ్యాషన్ అండ్ టెక్స్‌టైల్ రంగాల వృథా మీద దృష్టి పెట్టింది.

పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న వాయు, నీటి కాలుష్యాలతోపాటు వస్త్రాల అవశేషాలు కూడా ప్రధానమైనవి. క్లాత్‌తో డ్రెస్ కుట్టిన తర్వాత వచ్చే మిగులు నదులు, కాలువల్లోకి చేరి నీటిలో, నీటి అడుగుల మట్టిలో నిలిచిపోతోంది. కొంతకాలానికి ఆ వస్త్రానికి అద్దిన రసాయన రంగులు నేలలో, నీటిలో ఇంకుతాయి. ఇలా వేస్ట్ క్లాత్ కారణంగా కెమికల్ పొల్యూషన్ నీటిని, మట్టిని కూడా కలుషితం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా దుస్తుల తయారీ విపరీతంగా పెరిగిపోయింది. 2000 సంవత్సరంలో ఉత్పత్తి 2015నాటికి రెండింతలైంది. ఏడాదికి 92 మిలియన్ టన్నుల టెక్స్‌టైల్ వేస్ట్ లెక్క తేలుతోంది. ఇది కాలువలు, నదుల్లోకి వెళ్తోంది. దీనిని అరికట్టడం కోసమే యూఎన్‌ఓ (యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్) ఈ ఏడాది ఫ్యాషన్ ఇండస్ట్రీ వేస్ట్ మీద దృష్టి పెట్టింది. ఫ్యాషన్, టెక్స్‌టైల్ రంగాలను జీరో వేస్ట్ దిశగా నడిపించడానికి మార్గాలను అన్వేషించాలంటోంది యూఎన్‌ఓ. హైదరాబాద్‌లో ఫ్యాషన్ ఇండస్ట్రీ నిర్వహిస్తున్న సుదీప కందుల ట్రిపుల్ ఆర్ (రీ యూజ్, రీ సైకిల్, రీ పెయిర్) అనే యూఎన్‌ఓ థీమ్‌ను రెండు దశాబ్దాలుగా అమలు చేస్తున్నారు.



మనసుంటే మార్గం ఉంటుంది!

సుదీప కందుల... ఆలన బొటీక్ పేరుతో చిన్న పిల్లల దుస్తుల డిజైనింగ ప్రారంభించి మూడు దశాబ్దాలవుతోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీలో బొటీక్ కల్చర్ మొదలైన తొలినాళ్ల నుంచి బొటీక్ నడుపుతున్నారామె. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భావించే సుదీప, ఆమె ఉద్యోగులు పాలిథిన్ కవర్ల వినియోగాన్ని తగ్గించడానికి మార్కెట్‌కెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్‌ను వెంట తీసుకువెళ్తారు. బొటీక్‌లో ఉత్పన్నమయ్యే వేస్ట్ క్లాత్‌ను పునర్వినియోగంలోకి తీసుకురావడానికి అనేక మార్గాలనెంచుకున్నారు సుదీప. చిన్న ముక్కలతో నవజాత శిశువులకు, ఏడాది లోపు పిల్లలు ధరించడానికి వీలుగా కుట్టించి ఆర్ఫనేజ్‌కు ఇచ్చారు. అలా కుదరని వాటిని నగరంలోని ఒక ఎన్‌జీవోకి ఇస్తుంటారు. ఆ ఎన్‌జీవోలో అల్పాదాయ వర్గాల మహిళలకు ఆ క్లాత్‌తో చిన్న చిన్న పోట్లీ బ్యాగ్‌లు, పర్సులు తయారు చేసుకుంటారు. అలా కూడా పనికి రాని సన్నగా పొడవుగా రిబ్బన్ ముక్కల్లాంటి క్లాత్‌ని ఒక స్కూల్‌కి ఇస్తే వాళ్లు పిల్లల చేత డోర్‌మ్యాట్ మేకింగ్ వంటి క్రాఫ్ట్ ప్రాక్టీస్‌కి ఉపయోగిస్తున్నారు. ఇక ఎందుకూ పనికిరావనిపించే ముక్కలను ఒక కవర్‌లో జమ చేసి ఆ బొటీక్‌లో పని చేసే వాళ్లు దిండులో స్టఫింగ్‌గా నింపుకుంటారు. వ్యర్థాన్ని అర్థవంతంగా మారుస్తున్న సుదీప తన బొటీక్‌లో చిన్న ముక్క కూడా నేల పాలు కాకుండా ప్రయత్నం చేస్తున్నారు.

షాపింగ్ వ్యసనం



ఈ తరానికి షాపింగ్ ఒక వ్యసనంగా మారింది. యూఎస్, యూరప్‌ల నుంచి వాడిన దుస్తులు మూడవ ప్రపంచదేశాలకు డంప్ అవుతున్నాయి. అరేబియా షిప్పుల్లో గుజరాత్ తీరం నుంచి దేశంలోకి వస్తుంటాయవి. మన దగ్గర తయారయ్యే పాలియెస్టర్ వస్త్రాలకు తోడు ఆయాఖండాల నుంచి వచ్చిపడుతున్న దుస్తులు కూడా కలిసి డంప్ పెరిగిపోతోంది. పాలియెస్టర్ వస్త్రాలను ఫైబర్‌గా మార్చి కొత్త దుస్తులు తయారు చేసే క్రమంలో విడుదలయ్యే వ్యర్థాలు సముద్రాల్లోకి చేరి మైక్రోప్లాస్టిక్‌గా మారి తిరిగి మన మీదనే దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. అలాగే పారేస్తున్న దుస్తులతో కాలువలు నిండిపోతున్నాయి.

- డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, పర్యావరణ నిపుణులు

ఉత్పత్తి- కొనుగోలు పెరిగాయి

మనం కొంతకాలం వాడి ఇక పనికి రావని పారేస్తున్న వస్తువులు నిజానికి పనికిరానివి కాదు, వాటిని మరొక రకంగా మలుచుకుని ఉపయోగించుకోవడం మనకు చేతకాకపోవడమే. రీ యూజ్ చేయడం నేర్చుకోవాలి. నాచురల్ ఫైబర్‌తో వస్త్రాలు తయారుచేసినన్ని రోజులు వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల వ్యర్థాల గురించి మాట్లాడాల్సిన అవసరం రాలేదు. మ్యాన్‌మేడ్ ఫైబర్ ప్రవేశించిన తర్వాత ఎదురవుతున్న సమస్యలివన్నీ. నిజానికి వ్యర్థాల ఉత్పత్తి మనదేశంలోకంటే యూఎస్, యూరప్‌దేశాల్లో చాలా ఎక్కువ. అవసరానికి మించి ఉత్పత్తి చేయడం, అవసరానికి మించి కొనడం రెండూ పెరిగాయి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

జీరో వేస్ట్‌తో ద బెస్ట్

మార్చి 30 జీరో వేస్ట్ డే

ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాల వేస్ట్‌తో ఏటా ప్రపంచ వ్యాప్తంగా రెండు వందల కోట్ల టన్నుల చెత్త జమవుతోంది. ఇది పెరుగుతూ భూగ్రహాన్ని ముంచేసినా ఆశ్చర్యం లేదు. ఈ ప్రమాదాన్ని మన దేశంలో ముందుగా గ్రహించి అప్రమత్తమైన ప్రాంతం ఢిల్లీ, మాల్వీయ నగర్‌లోని నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ. రీయూజ్, రీసైకిల్‌ను ఫాలో అవుతూ జీరో వేస్ట్‌తో పర్యావరణప్రియమైన ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది.



● కంపోస్ట్ తయారీలో సొసైటీ సభ్యులు

దాదాపు ఏడేళ్ల కిందట... ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ మాల్వీయనగర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మీద ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. అందులో పాల్గొన్న నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ సభ్యులు ఆ వర్క్‌షాప్‌లో చెప్పినవి, చూపించినవి తమ కాలనీలో అమలు చేయడం మొదలుపెట్టారు. అక్కడ 250 ఇళ్లున్నాయి. ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో వివరించి, కొన్నాళ్లపాటు పర్యవేక్షించారు సొసైటీ సెక్రటరీ, కంటివైద్యులు డాక్టర్ రూబీ మఖీజా. తతిమా సభ్యుల సహాయసహకారాలతో తడిచెత్తతో కాలనీలోనే కంపోస్ట్ తయారుచేయడం మొదలుపెట్టారు. ఆ ఎరువుతో కిచెన్, బాల్కనీ, రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహించారు. ఒక షెడ్డు లాంటిదీ ఏర్పాటు చేశారు.. ఇళ్లల్లో పాతపుస్తకాలు, దుస్తులు, ఆటబొమ్మలు, ఉపయోగంలో లేని వస్తువుల కోసం. ఆ కాలనీలో ఎవరికైనా ఏ వస్తువైనా అవసరం ఉంటే ముందు ఈ షెడ్డుకొచ్చి చూసి, అందులో తమకు కావలసింది లేకపోతేనే కొత్తది కొనుక్కోవాలి. అలా కాలనీ వాసులు తీసుకున్నవి పోనూ మిగిలినవి స్వచ్ఛంద సంస్థలకు ఇస్తారు అవసరమైన వాళ్లకు పంచేందుకు! ఈ కాలనీలో ప్లాస్టిక్ బ్యాన్. గుడ్డ సంచులనే వాడుతారు. నీటి వృథా, ఆదానూ సమర్థవంతంగా నిర్వహించుకుంటున్నారు. పిల్లలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడానికి వారానికోసారి క్యాంప్ పెడతారు. అందులో పిల్లలను ఆడిస్తూ, పాడిస్తూ వాళ్ల ఎలక్ట్రానిక్ పరికరాలకు బానిసలు కాకుండా జాగ్రత్తపడుతున్నారు. వీళ్లో బ్రాడ్‌కాస్ట్ సిస్టమ్‌నూ ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిరోజూ కాలనీలో జరిగే పర్యావరణపరిరక్షణ కార్యక్రమాలను వీడియోలుగా తీసి వాటిని సాయంకాలం ప్రసారం చేస్తారు. ఈ ప్రయత్నాలతో జీరో వేస్ట్‌లో దేశానికే స్ఫూర్తిగా నిలిచింది నవజీవన్ విహార్.